ఆదర్శంగా వాకర్స్ పార్క్

- మరింత అందంగా తీర్చిదిద్దేందుకు వాకర్స్ క్లబ్ చర్యలు
- ప్రాంగణ విస్తరణ పనులు వేగవంతం



మురళీనగర్ వాకర్స్ పార్క్ అందమైన ముఖద్వారం

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్క్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు వాకర్స్ క్లబ్ చర్యలు తీసుకుంది. ప్రస్తుతం ఉన్న సౌకర్యాలకు అనుగుణంగా దీన్ని విస్తరించి సందర్శకులకు అనుకూలంగా తయారు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు పనులను వేగవంతం చేసింది. పార్క్‌లో ఏర్పాటు చేసిన తథాగతుడు, మహాత్ముడి విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఆక్వా వాటర్, కలర్‌ఫుల్ లైటింగ్, మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు.

ప్రాంగణం మరింత విశాలం

వాకర్స్ పార్క్‌లో నిర్వహిస్తున్న కార్యక్రమాలకు అత్యధిక సంఖ్యలో వాకర్స్, సందర్శకులు హాజరవుతున్నారు. ప్రస్తుతం ఉన్న ప్రాంగణం చాలడం లేదు. దీంతో దాని విస్తీర్ణాన్ని పెంచి హాజరయ్యే వారందరూ ఆసీనులయ్యేలా క్లబ్ ప్రతినిధులు చర్యలు తీసుకుంటున్నారు. 40 అడుగుల వెడల్పు, 20 అడుగుల పొడవుతో మొత్తం 800 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన స్థలాన్ని అభివృద్ధి చేస్తున్నారు. వేదిక ఎదురుగా ఉన్న ప్రాంగణానికి అనుబంధంగా దీన్ని విస్తరిస్తున్నారు. దీనికి టైల్స్ వేసి అందంగా తీర్చిదిద్దుతారు. దీంతో వేదిక ముందు ఉన్న ప్రాంగణ విస్తీర్ణం 2,400 చదరపు అడుగులకు పెరుగుతుంది. దీనికి సుమారు రూ.1 లక్ష ఖర్చు చేస్తున్నారు. దీని చుట్టూ విద్యుదీకరణ చేసి అందంగా తీర్చిదిద్దుతారు. క్లబ్ సాధారణ నిధులు దీనికి కేటాయించారు.

పచ్చదనం పెంపు.. పక్షుల సంరక్షణ

గ్రీనరీ పెంపునకు సంబంధించి బ్యూటిఫికేషన్‌లో భాగంగా అన్ని రకాల మొక్కలు నాటి పెంచుతారు. ఇందుకోసం జూన్ 5వ తేదీ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా విస్తృత స్థాయిలో శ్రమదానం చేసి మొక్కలు నాటుతారు. పిచ్చుకల సంరక్షణ కోసం బర్డ్ ఫుడ్ క్యారియర్లు ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ పక్షుల కోసం ఆహారాన్ని, నీటిని వీటి ద్వారా అందిస్తున్నారు.

ఆహ్లాదకర సంగీతం

వాకర్స్ పార్క్‌లో ఉదయం, సాయంత్రం వేళల్లో ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్ ప్లే చేస్తారు. వాకర్స్ ప్రత్యేకంగా మొబైల్స్‌లో సంగీతాన్ని వినాల్సి అవసరం ఉండదు. దీని వల్ల వాకర్స్ ఆహ్లాదకరం సంగీతాన్ని ఆస్వాదిస్తూ వాకింగ్, ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేసుకోవచ్చు. సాయంత్రం సీనియర్ సిటిజన్స్ ఆత్మీయ సమావేశం ఉంటుంది. ఈ సమయంలో సామాజిక సేవా కార్యక్రమాలపై చర్చిస్తారు. వాకర్స్ వాయిస్ పత్రిక ద్వారా తమ అభిప్రాయాలను పంచుకుంటారు.


వాకర్స్ పార్క్‌లో విస్తరిస్తున్న ప్రాంగణం


ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేస్తున్న వాకర్స్


మహాత్ముడి విగ్రహం


బర్డ్స్ ఫుడ్ క్యారియర్

క్లుప్తంగా

ఘనంగా నూకాంబిక నెల పండగ


అమ్మవారిని దర్శించుకుంటున్న కె.కె.రాజు, చొక్కాకుల వెంకటరావు తదితరులు

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు పెద్దకొత్తూరులో ఆంధ్ర యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నూకాంబిక అమ్మవారి నెల పండగ ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ ఉత్తర ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, కార్పొరేటర్లు కె.కామేశ్వరి, అల్లు శంకరరావు, చంద్రమౌళి, గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

45 మంది రక్తదానం


రక్తదానం చేస్తున్న స్థానికులు

సీతమ్మధార: ఆధ్యాత్మిక గురువు రవిశంకర్ 68వ జన్మదినం సందర్భంగా పి.వి.సహాయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం సీతమ్మధారలోని సితార ఎన్‌క్లేవ్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. 45 మంది స్థానికులు రక్తదానం చేశారు. లైన్స్ క్లబ్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో ట్రస్ట్ చైర్మన్ పి.వి.వి.ఎస్.మూర్తి, సభ్యులు వి.వి.రమణమూర్తి, జి.సాంబమూర్తి, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

సీతమ్మధార: జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షుడు, ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి వి.వి.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం ఏఎస్సార్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు నగరంలోని మాధవ్ బాగ్ ఆస్పత్రి సహకారంతో శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆరోగ్యమే ఆస్తి, దానిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరికీ వ్యాయామం, డైట్ అవసరమని, చిన్న వయసులోనే మధుమేహం ప్రబలడం విచారకరమన్నారు. ఈసీజీ, సుగర్ తదితర వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డా.రఘురామ్ చక్రవర్తి, అన్నపూర్ణ, మాధవీలత, శ్రీనివాసరావు, బాగ్ ఆస్పత్రి డాక్టర్ ఝాన్సీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రీన్‌బెల్ట్‌కు రక్షణ కరువు


సత్యం సెంటర్ వద్ద గ్రీన్‌బెల్ట్‌కు తొలగించిన ఫెన్సింగ్

సీతంపేట: బ్యూటిఫికేషన్‌లో భాగంగా జీవీఎంసీ 25వ వార్డు సత్యం జంక్షన్ వద్ద గ్రీన్ బెల్ట్‌ను వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, గ్రీనరీతో సుందరంగా తీర్చిదిద్దారు. గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో వాకింగ్ ట్రాక్‌కు ఇరువైపులా మొక్కలు నాటేందుకు మూడు నెలల కిందట ఫెన్సింగ్ తొలగించారు. మొక్కలు నాటే పనులు పూర్తయ్యాక ఫెన్సింగ్‌ను మాత్రం పునరుద్ధరించలేదు. దీంతో సత్యం సెంటర్ వద్ద హైవేకు ఆనుకొని గ్రీన్‌బెల్ట్‌కు ఫెన్సింగ్ తొలగించి ఉండటంతో రక్షణ లేకుండా పోయింది. రాత్రి పూట ఆకతాయిలకు అడ్డాగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రీన్‌బెల్ట్‌కు రక్షణగా ఓపెన్ జిమ్ వద్ద ఏర్పాటు చేసిన ఐరన్ గేట్ వెల్డింగ్ ఊడిపోయింది. సంబంధిత అధికారులు పరిశీలించి గ్రీన్‌బెల్ట్‌కు ఫెన్సింగ్‌తో రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

భువనేశ్వరి దేవిని దర్శించుకున్న కె.కె.రాజు


అమ్మవారికి కుంకుమ పూజ చేస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: సబ్బవరం మండలం ఆరిపాకలోని శ్రీ భువనేశ్వరి అమ్మవారి పీఠాన్ని ఆదివారం వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేకంగా కుంకుమ పూజలు చేశారు. అర్చకులు పండా తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ నిర్వాహకులు కె.కె.రాజును సత్కరించి అమ్మవారి చిత్రపటం బహూకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఎంవీపీ రైతుబజార్ సందర్శన

ఆరిలోవ: ఎంవీపీ రైతుబజార్‌ను ఆదివారం మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ జి.శేఖర్‌బాబు సందర్శించారు. భారత్ శనగపప్పు, మార్క్‌ఫెడ్ ఉత్పత్తుల విక్రయాలను పరిశీలించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై అందించిన శనగపప్పు విక్రయాలకు సంబంధించిన రికార్డులు తనిఖీ చేశారు. వినియోగదారుల కోసం అందుబాటులో ఉన్న మార్క్‌ఫెడ్ ఉత్పత్తుల గురించి సిబ్బందిని ఆరా తీశారు.

సాధనతోనే కళాకారులుగా రాణింపు


జ్యోతి ప్రజ్వలనతో పోటీలు ప్రారంభిస్తున్న సంగీత విద్వాంసుడు ద్వారం త్యాగరాజు

సీతంపేట: సరస్వతి అమ్మవారి ప్రతిరూపంగా సంగీతం ఆవిర్భవించిందని సంగీత విద్వాంసుడు ద్వారం త్యాగరాజు అన్నారు. అన్నమాచార్యుని జయంతిని పురస్కరించుకుని శృతిలయ సేవా సంస్థ వ్యవస్థాపకుడు వి.ప్రభాకర్ సారథ్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో అన్నమాచార్య సంకీర్తన పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా త్యాగరాజు జ్యోతిప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ కళాకారుడికైనా భక్తి, శ్రద్ధ, ఏకాగ్రత, సాధన ఎంతో అవసరమని, సాధనతోనే ఉత్తమ సంగీత కళాకారులుగా రాణిస్తారన్నారు. తేనె వంటి తెలుగు పదాలతో వేంకటేశ్వర స్వామిని సంకీర్తన రూపంలో కీర్తించిన ఘనత అన్నమాచార్యుడికే దక్కిందన్నారు. మంచి కార్యక్రమం నిర్వహించారని శృతిలయ సంస్థ వ్యవస్థాపకులను అభినందించారు. ఈ నెల 23న అన్నమాచార్య జయంతి రోజున విజేతలకు బహుమతి ప్రదానం చేస్తామని నిర్వాహకులు తెలిపారు. నాలుగు విభాగాల్లో జరిగిన పోటీల్లో సుమారు 300 మంది కళాకారులు సంగీతంపై తమకున్న ప్రతిభ చాటారు.

కార్యక్రమంలో కనకమహాలక్ష్మి దేవస్థానం మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరాజు, శృతిలయ సంస్థ కార్యదర్శి ఎం.ఎస్.మాధవ్, కొణతాల రాజు, ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, సిహెచ్.వి.సత్యనారాయణ, మేడా మస్తాన్‌రెడ్డి, కె.మంజుల, శారద, సుజని పాల్గొన్నారు.

సేవా కార్యక్రమంగా జన్మదిన వేడుక


జనరేషన్ యువ ఆశ్రమ చిన్నారులతో కేక్ కట్‌చేయిస్తున్న మహిళా వాకర్స్ సభ్యులు

మురళీనగర్: మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు పుట్టిన రోజు వేడుకలను సేవా కార్యక్రమంగా నిర్వహించాలని నిర్ణయించారు. వారితో పాటు వారి కుటుంబ సభ్యుల పుట్టిన రోజు నాడు అనాథ శరణాలయాల్లో సేవా కార్యక్రమం నిర్వహించేందుకు ముందుకొచ్చారు. ఈ మేరకు ఆదివారం క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి ఆధర్వంలో క్లబ్ పూర్వ అధ్యక్షురాలు ఐ.ఇందిరాదేవి మనుమడి పుట్టిన రోజు సందర్భంగా జనరేషన్ యువ ఆశ్రమాన్ని సందర్శించి అక్కడి చిన్నారులతో కేక్ కట్‌చేయించారు. పిల్లలకు ఉదయం అల్పాహారం అందించి, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షురాలు సిహెచ్.లక్ష్మి, కోశాధికారి పి.కమల, పూర్వ అధ్యక్షురాలు కె.మాధవి, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

కోలాహలంగా ఎర్నిమాంబ జాతర



ఆలయంలో కొలువైన ఎర్నిమాంబ అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

కంచరపాలెం: జ్ఞానాపురం, అల్లిపురం ప్రజల ఇలవేల్పుగా కొలిచే ఎర్నిమాంబ అమ్మవారి జాతర మహోత్సవం ఆలయ ఈవో డీవీవీ సురేష్‌బాబా ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి భక్తులు అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకుడు పూలఖండం శ్రీకాంత్‌శర్మ, పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్, 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, శ్రీధర్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు

నగరంలోని పలు ప్రాంతాలతోపాటు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం మూలవిరాట్‌ను వేలాది మంది భక్తులు సుమారు 252 అమ్మవారి ప్రతిమలతో దర్శించుకున్నారు. అనంతరం అనుపోత్సవం ఘనంగా నిర్వహించారు. జాతరలో నేల వేషాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. పలు సంఘాల ప్రతినిధులు భక్తులకు మజ్జిగ, పులిహోర పంపిణీ చేశారు. దేవదాయశాఖ సిబ్బంది, ఆలయ చైర్మన్, సిబ్బంది ఉత్సవాలను పర్యవేక్షించారు.


మూలవిరాట్ వద్ద అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

కొనసాగుతున్న చందనం అరగదీత


చందనం అరగదీస్తున్న సిబ్బంది

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో రెండో విడత చందనం అరగదీత ఆదివారం కూడా కొనసాగింది. ఈ నెల 23న వైశాఖ పౌర్ణమి పురస్కరించుకుని స్వామికి రెండో విడతగా మూడు మణుగుల(120 కిలోలు) పచ్చి చందనం సమర్పించనున్నారు. దీనిలో భాగంగా తొలిరోజు శనివారం 40 కిలోలు చందనం అరగదీయగా రెండో రోజు ఆదివారం 37 కిలోల చందనాన్ని అరగదీశారు. రెండు రోజుల్లో 77 కిలోల చందనం సమకూరింది. సోమవారం కూడా చందనం అరగదీత చేపట్టనున్నారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేత్రపర్వంగా శ్రీవారి రథోత్సవం


రథంపై ఊరేగుతున్న వేంకటేశ్వరస్వామి

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం శ్రీవారి రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ముందుగా స్వామివారికి సుప్రభాత సేవ, విశేష పూజలు జరిపారు. సాయంత్రం స్వామివారు వెంకటాద్రి నుంచి పెందుర్తి పురవీధుల్లో రథంపై చినముషిడివాడ సప్తగిరినగర్‌లోని అలివేలు మంగమ్మ సన్నిధి వరకు భక్తులకు ఆశీస్సులు అందించారు. తప్పెటగుళ్లు, కోలాటాలు, మేళతాళాలతో ఊరేగింపు అత్యంత సందడిగా సాగింది. మంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా ఆఖరి రోజు సోమవారం ఉదయం స్వామివారికి చక్రస్నానం, చక్రత్తాళ్వారులతో కలిసి దివ్య స్నానమాచరిస్తారు. సాయంత్రం పుష్పయాగం, మహాపూర్ణాహుతి, ద్వాదశారాధన, స్వామివారికి విశేష అర్చనలు, ఊంజల్ సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ప్రతినిధులు వెల్లడించారు.

'ఉత్కల్ సమాజ్' నూతన కార్యవర్గం

బీచ్‌రోడ్డు: ఉత్కల్ సంస్కృతిక సమాజ్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. సిరిపురంలోని ఉత్కల్ సమాజ్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో అధ్యక్షుడిగా జె.కె.నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కె.కె.పది, కార్యదర్శిగా బిమిల్ కుమార్ మహంత్, ట్రెజరర్‌గా మహేశ్వర బెహరతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గం ఏడాది పాటు కొనసాగనుంది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి సభ్యులు అభినందనలు తెలిపారు.

మంచిగా జీవించండి


ద్వారకా పీఎస్‌లో రౌడీషీటర్లకు సూచనలిస్తున్న సీఐ రమేష్, ఎస్‌ఐ శ్రీను


ఫోర్త్‌టౌన్ పీఎస్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్‌ఐ వెంకటరావు

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఎస్.రమేష్ మాట్లాడుతూ ఎటువంటి నేరాలకు మళ్లీ పాల్పడకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. గొడవలు చేయడం, హద్దు మీరి ప్రవర్తించడం వంటివి చేస్తే కఠిన చర్యలు తప్పవని రౌడీషీటర్లను హెచ్చరించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని, మంచిగా జీవించాలని హితవు పలికారు. కౌన్సెలింగ్ అనంతరం రౌడీషీటర్లను వారి ఇళ్ల వద్ద పోలీసులు అప్పగించారు. ఎస్‌ఐ శ్రీను, ఏఎస్‌ఐ గంగాధర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

- ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు ఎస్‌ఐ వెంకటరావు కౌన్సెలింగ్ నిర్వహించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో కలిసి హాయిగా జీవించాలని వారికి ఎస్‌ఐ సూచించారు. ఎటువంటి నేరాలు చేయకుండా మంచిగా ఉండాలన్నారు.

వైభవంగా దుర్గమాంబ ఉత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు
దుర్గమాంబ నిజరూపం (ఇన్‌సెట్)

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు కైలాసపురం శాంతినగర్ వాసుల ఆరాధ్యదైవం దుర్గమాంబ అమ్మవారి జాతర మహోత్సవం ఆలయ ధర్మకర్త ఎరిపిల్లి అప్పారావు నేతృత్వంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. 16 గ్రామాల ఇలవేల్పుగా కొలిచే దుర్గమ్మను భక్తులు అధిక సంఖ్యలో వేకువజాము నుంచే దర్శించుకున్నారు. పసుపు, కుంకుమలతో విశేష అభిషేకాలు పూజలు జరిపారు. జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, నేషనల్ పోర్ట్ ట్రస్ట్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు గొర్లె చందు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పోలీసుల బందోబస్తు నడుమ ఉత్సవాన్ని జరిపించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అపూర్వ కలయిక.. ఆనంద వేడుక


పూర్వ ఉపాధ్యాయులతో ఆర్పీ పేట హైస్కూల్ 2006-07 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

కంచరపాలెం: కంచరపాలెం రామ్మూర్తిపంతులుపేట జీవీఎంసీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో కలుసుకుని ఆనందంగా గడిపారు. 2006–07 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు తమ పూర్వ ఉపాధ్యాయులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 17 ఏళ్ల కిందట పాఠశాలలో చదువుకున్న మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని వ్యక్తిగత జీవిత విశేషాలను అడిగి తెలుసుకున్నారు. నాటి గురువులకు మెమొంటాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. ఉత్తమ విద్యను అందించి తమ జీవితాలను తీర్చిదిద్దిన ఉపాధ్యాయులకు ఎంతో రుణపడి ఉంటామని పూర్వ విద్యార్థులు తెలిపారు. పాఠశాల ఇన్‌చార్జి కె.సత్యనారాయణకు ఎలక్ట్రికల్ బెల్‌ను తమ గుర్తుగా అందించారు. పూర్వ విద్యార్థులంతా ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు నారాయణరావు, బి.సత్యనారాయణ, ప్రభాకర్, అరుణకుమారి, హేనా, సుమలత, హరినాథ్, శ్వేత, నాగేశ్వరరావు, ఎల్.చైతన్య, ఎస్.ఎస్.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జీవ వైవిధ్య ఉద్యానవనంలో సందడి


పార్కు విశేషాలు తెలుసుకుంటున్న కళాశాల విద్యార్థులు


ఇంట్లో పెంచుకునే మొక్కలతో విద్యార్థులు

ఏయూ క్యాంపస్: పెదవాల్తేరులోని రాణి చంద్రమణిదేవి ఆస్పత్రి ఆవరణలో ఉన్న జీవ వైవిధ్య ఉద్యానవనం ఆదివారం సందడిగా కనిపించింది. ఈ పార్కును అల్లిపురంలోని యూనిటీ డిగ్రీ కళాశాల, సెయింట్ జోసఫ్ కళాశాల విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా పార్కులో మొక్కల విశేషాలు, ప్రత్యేకతలను పార్కు నిర్వాహకుడు డాక్టర్ మంథా శ్రీరామమూర్తి వివరించారు. వేలాది జాతులకు చెందిన మొక్కలను ఒకే చోట చూసి విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. పుస్తకాలలో ఉన్న మొక్కల విశేషాలను ప్రత్యక్షంగా వీక్షించి సంభ్రమపడ్డారు. విద్యార్థులకు ప్రత్యక్ష ప్రయోగశాలగా ఈ ఉద్యానవనం నిలుస్తోందని శ్రీరామమూర్తి తెలిపారు. ఫార్మసీ, వృక్షశాస్త్రం విభాగాల విద్యార్థులు నిత్యం ఈ జీవవైవిధ్య ఉద్యానవనాన్ని సందర్శిస్తున్నారని చెప్పారు. వేసవి కాలం కావడంతో మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రోడ్డెక్కిన మురుగు నీరు


బిర్లా కూడలి సర్వీస్ రోడ్డులో ప్రవహిస్తున్న మురుగు నీరు

మురళీనగర్: బిర్లా కూడలి సర్వీస్ రోడ్డులో మురుగు నీరు రహదారిపై ప్రవహిస్తుండటంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇక్కడి పెట్రోల్ బంక్ నుంచి వర్మా కాంప్లెక్స్‌కు వెళ్లే రహదారిని ఆనుకుని ఉన్న కాలువలో పూడిక తీయకపోవడం వల్ల మురుగు ప్రవాహానికి అడ్డంకి ఏర్పడి నీరు పొంగి రహదారిపైకి వస్తోంది. ఇలా తరచూ జరుగుతున్నా.. శానిటరీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పలువురు ప్రయాణికులు చెబుతున్నారు. తక్షణం ఈ సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.